క్లుప్తంగా

శ్రీశైలంలో 30అడుగుల రుద్రాక్ష సహిత శివలింగం


30అడుగుల శివలింగం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రంలో కామ్య రుద్రాక్ష అధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో 30అడుగుల రుద్రాక్ష సహిత మహాశివలింగాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు శివలింగ దర్శనం కల్పించడంతో పాటు 20లక్షల రుద్రాక్షలను ఉచితంగా భక్తులకు పంపిణీ చేస్తున్నట్లు కామ్య రుద్రాక్ష అధ్యాత్మిక సేవా సమితి వ్యవస్థాపకులు పగడాల మల్లికార్జున రావు తెలిపారు. శ్రీశైల మహాక్షేత్రంలో ఇటువంటి మహాత్కార్యానికి సహకారాలు అందించిన దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు, ఆలయ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వెళ్లొస్తాం..మల్లన్నా..!


శ్రీశైలం నుంచి తిరుగుపయనానికి సిద్ధమవుతున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు లక్షలాదిగా తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టాలైన పాగాలంకరణ, కల్యాణోత్సవం, రథోత్సవం, తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు ముగిశాయి. 10రోజులు పాటు వివిధ వాహనసేవల్లో దర్శనమిచ్చిన స్వామిఅమ్మవార్లను కన్నులారా దర్శించి భక్తులు తరించారు. శనివారం రథోత్సవం, తెప్పోత్సవం ముగియడంతో భక్తులు తిరుగుపయనమయ్యారు. వివిధ వాహనాల్లో, ఆర్టీసీ బస్సులలో భక్తులు వెళ్లొస్తాం మల్లన్నా అంటూ వారి స్వగ్రామాలకు బయలుదేరారు.

శ్రీశైలం శివమయం


క్షేత్ర వీధుల్లో భక్తుల సందడి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు దేదీప్యమానంగా సాగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినాన మల్లికార్జున స్వామివారికి పాగాలంకరణ, కల్యాణోత్సవం అనంతరం మల్లన్న దర్శనానికి భక్తులు బారులు తీరారు. శనివారం భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండిపోయాయి. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగాణం మారుమోగింది. భక్తులందరికీ సౌకర్యవంతమైన స్వామివారి దర్శనం కల్పించేందుకు అలంకార దర్శనానికి మాత్రమే అవకాశమిచ్చారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్ని కిటకిటలాడాయి.

పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి


వైర్‌లెస్ సెట్ ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్

శ్రీశైలంటెంపుల్:మహాశివరాత్రి బ్రహ్మోత్స వాల్లో భాగంగా శ్రీశైల క్షేత్ర పరిధిలో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం దేవస్థాన కమాండ్ కంట్రోల్ రూం నందు వైర్లెస్ సెట్ ద్వారా జిల్లా పంచాయతీ అధికారికి పలు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య సమస్య లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే రథోత్సవం, తెప్పోత్సవం తదితర ఏర్పాట్లపై దేవస్థానం అధికారులకు, పోలీసు యంత్రాంగానికి పలు సూచనలు జారీ చేశారు.

రేపు అబ్దుల్లాపురంలో నాటక ప్రదర్శన


ఆర్గనైజర్‌కు నగదు అందజేస్తున్న నాయకులు

వెలుగోడు: మండంలోని అబ్దుల్లాపురం గ్రామంలో ఈనెల 11వ తేదీ రాత్రి సరస్వతి నాటక మండలి వారిచే గొప్ప పౌరాణిక ఉచిత నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆర్గనైజర్ నాగేశులు గౌడ్ తెలిపారు. అబ్దుల్లాపురం గ్రామం పెద్దల సహకారంతో నిర్వహించబడుతున్న ఈ ఉచిత నాటక ప్రదర్శనకు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి తన సొంత నిధులు రూ.20 వేల నగదును సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి ద్వారా అందజేశారు.

కమనీయం.. లలితా సంగమేశ్వరుల కల్యాణం

కొత్తపల్లి: సప్తనదీ సంగమ ప్రాంతంలో వెలసిన ప్రాచీన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ఆలయ ప్రాంగణంలో శ్రీలలితా సంగమేశ్వరుల కల్యాణ మహోత్సవం ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ మోహన్ పర్యవేక్షణలో ఎంతో వైభవంగా జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు సంగమేశ్వరాలయాన్ని చేరుకొని, సప్తనదుల సంగమ ప్రాంతంలోని కృష్ణానది జలాలో పుణ్యస్నానాలు ఆచరించారు.ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య, శాస్త్రోక్తంగా కల్యాణ తంతు సాగింది.

హుండీ లెక్కింపు..

సప్తనదుల సంఘమ క్షేత్రంలో వెలసిన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా క్షేత్రంలో ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు వేసిన కానుకలను హుండీ లెక్కింపు ఈఓ మోహన్, ఎర్రమఠం సర్పంచు బాల ఎల్లయ్య, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగింది. హుండీలో వేసిన విరాళాలను లెక్కించగా రూ.72,534 నగదు వచ్చినట్లు ఈఓ తెలిపారు. వీటిని దేవాలయ అవసరాల నిమిత్తం ఖర్చు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కృష్ణ, దేవాదాయ శాఖ సిబ్బంది భక్తబృందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీశంకరమల్లేశ్వరస్వామి, ఉమామహేశ్వరిదేవి కల్యాణం

జూపాడుబంగ్లా: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం తెల్లవారుజామున మండలంలోని తూడిచెర్ల, జూపాడుబంగ్లా, తాటిపాడు, 80బన్నూరు, తర్తూరు, పారుమంచాల, తదితర గ్రామాల్లో లింగోద్భవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లోని శివలింగాలకు బిల్వార్చన, పుష్పార్చన, కుంకుమార్చన, పంచామృతాభిషేకాలతో విశేషపూజలు నిర్వహించారు. ఉపవాసదీక్షలతో భక్తులు శివలింగాలకు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తూ జాగరణ చేశారు. తూడిచెర్ల గ్రామంలో శ్రీమల్లికార్జున సమేత భ్రమరాంకాక అమ్మవార్లకు వేదమంత్రాల మధ్య అర్చకులు భక్తిశ్రద్ధలతో కల్యాణం నిర్వహించారు. తూడిచెర్ల గ్రామంలో వెలసిన ఉమా మహేశ్వరి అమ్మవారికి శనివారం ఉదయం గ్రామానికి చెందిన మహిళలు సామూహికంగా బోనాలను సమర్పించారు. సాయంత్రం శ్రీభ్రమరాంబసమేత శంకరమల్లేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామపురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం అర్చకులు పూర్ణాహుతితో శివరాత్రి వేడుకలను ముగించారు.


తంగడంచ గ్రామంలో శ్రీకాశీవిశ్వేశ్వర,అన్నపూర్ణమాత రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

నంది వాహనంపై ఓంకార సిద్ధేశ్వరస్వామి దంపతులు


ఓంకారంలో నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం ఆలయం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తజనంతో కిటకిటలాడింది. పలు ప్రాంతాల భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్సవాలు కనులపండుగా జరిగాయి. శనివారం శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లకు సాయంత్రం నందివాహనంపై గ్రామోత్సవం వైభవంగా సాగింది. బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కనుల పండువగా కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని తంగడంచ గ్రామంలో వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణమాత వార్ల రథోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం కనుల పండువగా సాగింది. అర్చకుడు ఉమామహేశ్వరశర్మ స్వామి,అమ్మవార్ల ఉత్సవవిగ్రహాలకు పన్నీటి స్నానం చేయించి పట్టువస్త్రాలతో ముస్తాబుచేశారు. దేదీప్యమానంగా అలంకరించిన రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవవిగ్రహాలను ఆశీనులు గావించి.. భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథాన్ని ముందుకు కదిపారు. రథాన్ని గ్రామపురవీధుల్లో తిప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదులఈశ్వరరెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


సంగమేశ్వరంలో వధూవరులుగా స్వామి,అమ్మవార్లు


బిజినవేములలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవం

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి శ్రీ కాశీ చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని గ్రామస్తులు, భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈఓ కార్తీక్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తజనంతో మహానంది కిటకిట


ఆలయ ప్రాంణంలో కిక్కిరిసిన భక్తులు

మహానంది: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహానంది ఆలయం భక్తజనంతో పోటెత్తింది. వేలాది సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. పలు ప్రాంతాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలిరావడంతో ఎటూ చూసినా భక్తజనసంద్రమే కనిపించింది. శుక్రవారం వేకువజాము నుంచి శనివారం రాత్రి వరకు నిరంతరంగా దర్శనం కొనసాగగా సాధారణ, ప్రత్యేక, శీఘ్రదర్శనం క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, ఆలయ సిబ్బంది నాగమల్లయ్య, రంగన్న తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాత్రి లింగోద్భవం సమయంలో ఒక్కసారిగా భక్తులు పోటెత్తారు.

ఓంకారంలో నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో ఆదివారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని ఈఓ నాగప్రసాద్ శనివారం తెలిపారు. శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వారి హుండీ కానుకల లెక్కింపునకు సిబ్బంది అందరూ హాజరుకావాలని కోరారు.

డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తాం

నందికొట్కూరు: పట్టణంలో మురుగు కాలువల నుంచి దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తానని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మురుగు కాలువలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలను శుభ్రం చేయడం వలన దోమల బెడద తగ్గుతుందన్నారు. కాలువలు నిండి దుర్వాసన వచ్చినా, దోమల బెడద పెరిగిన వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యానికి ప్రజలు సంపూర్ణంగా సహరించాలని, మురుగు కాలువలో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా చెత్తకుండిలో వేయాలని కోరారు. పట్టణంలో నీటి సమస్యలు తలెత్తితే వెంటనే మున్సిపల్ కార్యాలయానికి సమాచారం అందించాలని, ట్యాంకర్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.


మురుగు కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

తాగునీరు వృథా

పగిద్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు నిర్మించిన లక్ష్మాపురం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నీరు వృథా అవుతోంది. రెండు నెలలుగా లక్ష్మాపురం, పడమర ప్రాతకోట గ్రామాల మధ్య పైప్‌లైన్ లీకేజీ ఏర్పడి నీరు కలుషితమవుతున్నా పట్టించుకునే నాథుడు లేరని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాతకోట సంతమార్కెట్‌లోని ఓవర్ హెడ్ ట్యాంక్‌కు ఎదురుగా వాల్వ్ దెబ్బతిని నీరు వృథాగా పోతున్నాయి. వాల్వ్‌లో నీరు నిల్వ ఉండి దుర్గంధభరితంగా తయారువుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గ్రామంలో కొద్ది రోజులుగా నీటి ఎద్దడి నెలకొందని చేతిపంపులు కూడా అడుగంటిపోయి నిరుపయోగంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ మెయింటనెన్స్ కాంట్రాక్టర్ స్పందించి పైప్ లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించి ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని ప్రాతకోట గ్రామస్తులు కోరుతున్నారు.


కుమ్మరి గోవిందు పొలం వద్ద లీకేజీ ఏర్పడి నీరు వృథాగా పారుతున్న నీరు

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని అలగనూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనంపై మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ శనివారం తెలిపారు. అలగనూరు గ్రామానికి చెందిన రమణయ్య అనే వ్యక్తి మిడుతూరు నుంచి అలగనూరు గ్రామానికి తన ద్వి చక్రవాహనంపై మద్యం బాటిళ్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద 54 బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతోపాటు ద్వి చక్ర వాహనం సీజ్ చేశారమని చెప్పారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలో కలుషిత నీరు పంపిణీ కాకుండా చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు అనుగుణంగా బిలాల్ నగర్ నేషనల్ కళాశాల వద్ద నీరు కలుషితం కావడానికి గల కారణాలను మున్సిపల్ డీఈ శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. రెండు, మూడు నీటి కనెక్షన్లు మురుగు కాల్వ గుండా పోవడం గుర్తించి వాటిని తొలగించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కాచి వడబోసిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది సహకారంతో ఇంటింటికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మహానందిలో శనివారం రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగాయి. వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నేతలు శిల్పా కార్తీకర్‌రెడ్డి, శిల్పా భువనేశ్వర రెడ్డి పోటీలను ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో కూకట్‌పల్లి ఎస్ఎస్ బుల్స్ మొదటి స్థానం సాధించాయి. కృష్ణాజిల్లాకు చెందిన డీవీఆర్ మెమోరియల్ వృషభాలు ద్వితీయస్థానం, గుంటూరు జిల్లా పీఆర్ మెమోరియల్ వృషభాలు తృతీయస్థానం, బాపట్ల ఆర్‌కే బుల్స్ నాలుగు, పీఆర్ మెమోరియల్ వారి ఎద్దులు ఐదో స్థానం సాధించాయి. వీరికి వరుసగా మొదటి బహుమతి రూ. 1.25లక్షలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ద్వితీయ బహుమతి రూ. 80వేలు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, రూ. 60వేలు బాచం నాగేశ్వరరెడ్డి, రూ. 40వేలు శవ్వా శరభారెడ్డి, రూ. 30వేలు అల్లినగరం సర్పంచ్ మద్దుల లక్ష్మీదేవి, బాలవెంకటరెడ్డి దంపతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు కందుల రఘురామిరెడ్డి, కుంచపు శ్రీనివాసులు, జయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతులను సన్మానిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి, భువనేశ్వరరెడ్డి

ఓంకారంలో రసవత్తరంగా..

ఓంకారం పుణ్యక్షేత్రంలో ఎద్దుల పందేలు రసవత్తరంగా సాగాయి. ఓంకారం, కృష్ణనంది ఆలయాల్లో శిల్పా కార్తీక్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ప్రకాశం జిల్లా దర్గా గ్రామానికి చెందిన లాయర్ కృష్ణ వృషభాలు మొదటిస్థానంలో నిలిచాయి. వడ్లరామాపురం లలిత్ వృషభాలు ద్వితీయస్థానం, రాయవరం అనన్యారెడ్డి వృషభాలు మూడోస్థానం, రేగడకొత్తూరు వృషభాలు నాలుగు, కె.బొల్లవరం వెంకటరమణ వృషభాలు ఐదు, బుక్కారం నాగరాజు వృషభాలు ఆరోస్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ. 50వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు, రూ. 20వేలు, రూ. పదివేల, రూ. 8వేలు నగదు బహుమతులు అందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

- మృతుడు నల్లకాల్వ వాసి

నవీపేట: నిజామాబాద్ జిల్లా నవీనపేట మండలంలోని జన్నేపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాపీమేస్త్రి కంచర్ల రమేశ్ (38) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామానికి చెందిన రమేశ్ జన్నేపల్లిలో తాపీమేస్త్రిగా పని చేస్తున్నాడు. ఈనెల 7న రోడ్డువెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. తలకుతీవ్ర గాయాలు కావడంతో రమేశ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇండోర్ స్టేడియం స్థలం ఏమైనట్టు?

- 2013లో స్టేడియం కోసం 5.70 ఎకరాల స్థలం కేటాయించిన అధికారులు
- టీడీపీ హయాంలో కబ్జాచేసిన ఆ పార్టీ నేతలు
- స్థలం ఎక్కడుందో చూపలేకపోతున్న రెవెన్యూ అధికారులు


స్టేడియం నిర్మాణం కోసం కేటాయించినట్లు పేర్కొంటున్న 717 సర్వేనెంబర్ స్థలం ఇదే

జూపాడుబంగ్లా: ప్రస్తుతం టీడీపీ నాయకుల తీరు చూస్తే దొంగతనం చేసిన దొంగలే దొంగా..దొంగా అంటూ అరుస్తున్నట్లుగా ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ప్రతి మండలంలో రాజీవ్‌గాంధీ ఖేల్ అభియాన్ పథకం కింద స్టేడియం నిర్మాణం కోసం స్థలాలు కేటాయించారు. అందులో భాగంగా మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని సర్వేనెంబర్ 717లో 5.70ఎకరాల స్థలాన్ని ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు నివేదికలు సమర్పించారు. ఈ మేరకు 2013లో అప్పటి జిల్లా కలెక్టర్ సర్వేనెంబర్ 717లో 5.70ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

స్థలం విలువ రూ.1.10కోట్లు

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని కబ్జాచేశారు. స్టేడియం కోసం కేటాయించిన 5.70 ఎకరాల స్థలం విలువ రూ.1.10కోట్లు ఉంటుంది. ఆ స్థలం ఎక్కడుందో అధికారులకు తెలియకుండా కుట్రలు పన్నారు. రెవెన్యూ అధికారులు ఇప్పటిదాకా స్థలాన్ని చూపలేకపోతున్నారు. దీంతో క్రీడాకారులు ఆటలు ఆడుకునేందుకు క్రీడాప్రాంగణం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని చూపించాలని క్రీడాకారులు కోరుతున్నారు. స్థలం చూపిస్తే శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో స్టేడియాన్ని మంజూరు చేయించుకుంటామని వివిధ గ్రామాల క్రీడాకారులు కోరుతున్నారు. అయినా రెవెన్యూ అధికారులు స్థలం చూపించడం లేదు.

కబ్జాకు గురైన స్థలాన్ని స్టేడియానికి కేటాయించాలి



టీడీపీ నాయకులు కబ్జాచేసిన ఇండోర్ స్టేడియం స్థలాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని తిరిగి స్టేడియానికి కేటాయించాలి. మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో సెంటు స్థలం రూ.2లక్షలు అమ్ముడవుతుంది. ఈలెక్కన సుమారు రూ.1.10కోట్ల విలువైన స్థలాన్ని కబ్జాచేశారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని కబ్జాకు గురైన స్టేడియం స్థలాన్ని స్వాధీనం చేసుకొని స్టేడియానికి కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, జూపాడుబంగ్లా

స్థలం చూపిస్తే స్టేడియం మంజూరు చేయించుకుంటాం



జూపాడుబంగ్లాలో స్టేడియం నిర్మాణం కోసం 2013లో 717 సర్వేనెంబర్‌లో 5.70ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు కలెక్టర్‌కు రెవెన్యూ అధికారులు పంపిన నివేదికలున్నాయి. ఆ నివేదికల ప్రకారంగా స్టేడియం కోసం కేటాయించిన స్థలం ఎక్కడుందో చూపించాలని రెవెన్యూ అధికారులను క్రీడాకారులందరం కలిసి పలుమార్లు కోరినా వారు ఇప్పటిదాకా స్థలం చూపించడం లేదు. మండలకేంద్రంలో క్రీడాకారులు ఆటలు ఆడుకొనేందుకు స్థలంలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు స్థలం చూపిస్తే శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో స్టేడియం మంజూరు చేయించుకుంటాం.

– వినయ్, క్రీడాకారుడు, జూపాడుబంగ్లా

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి

నంద్యాల(అర్బన్): అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరను అనుసరించి వంట గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.500కే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగదారులకు రూ.500 కే సిలిండర్‌ను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం మహిళ ఓట్లు రాబట్టేందుకు సిలిండర్‌పై రూ.100 తగ్గిస్తున్నామని ప్రకటించడం దారుణమన్నారు.సిలిండర్ ధరను పూర్తి స్థాయిలో తగ్గించి అందజేయాలని డిమాండ్ చేశారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


తుడుమలదిన్నెలో బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన తుడుమలదిన్నె, ఉయ్యాలవాడలో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. వీరి వెంట ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత్‌నాయక్, ఎస్‌ఐ రామాంజనేయ రెడ్డి, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఫరీందర్, షరీఫ్ ప్రజలను అప్రమత్తం చేస్తూ రానున్న ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

వైభవంగా ఆది దంపతుల కల్యాణం


కాళికాంబ దేవాలయంలో..


రామాలయంలో కాశీవిశ్వనాథుడు, విశాలాక్షి స్వామి అమ్మవార్లకు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ఆది దంపతులైన శివ పార్వతుల కల్యాణం పట్టణంలోని శైవక్షేత్రాల్లో శుక్రవారం అర్ధరాత్రి అనంతరం మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలం అనంతరం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు, రాత్రి జాగారణ, శివనామస్మరణలతో గడిపారు. ప్రథమనందీశ్వర దేవాలయం, సోమనందీశ్వర దేవాలయం, సమజీవనగర్ రామాలయం, ఎన్‌కే రోడ్డులోని నాగలింగేశ్వర ఆలయం, రోజాకుంటలోని నాగలింగేశ్వర ఆలయం, మల్లికార్జునస్వామి దేవాలయం, కాళికాంబ చంద్రశేఖర దేవాలయం తదితర ఆలయాల్లో శనివారం తెల్లవారుజామున 4గంటల వరకు కల్యాణోత్సవ కార్యక్రమాలను నిర్వాహకులు జరిపించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

గడ్డివాముల దగ్ధం

చాగలమరి: తోడేండ్లపల్లె గ్రామంలో దస్తగిరి స్వామి దర్గా సమీపంలోని కల్లంలో ఏర్పాటు చేసుకున్న 3 గడ్డి వాములు ప్రమాదవశాత్తు శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన గూడిగి ఓబులపతి, ఎస్.రామకృష్ణ అనే రైతులు ఏర్పాటు చేసుకున్న గడ్డి వాములకు మంటలు చెలరేగడంతో సమాచారమందుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. శనివారం ఉదయం వరకు అక్కడే ఉండి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

నేడు కోత పండుగ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని హోలీ క్రాస్ క్యాథడ్రల్ పాస్టేట్-2 (ఆల్ సెయింట్ చర్చి) ఆలయంలో కోత పండుగను జరుపుతున్నట్లు డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్, సెక్రెటరీ కిరణ్ కుమార్, బాలన్న శనివారం తెలిపారు. వారు మట్లాడుతూ ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఆరాధన కార్యక్రమం ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభమవుతుందన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీశైలం, నందికొట్కూరు
70750 09158
Office mail : sakshiknladvt@gmail.com